
మూలం
పి.జి. వుడ్‌హౌస్
అనుసృజన
గబ్బిట కృష్ణమోహన్
పిక్కడిల్లీ జిమ్
ఉరఫ్
పాతాళ భైరవి

# ఆపద్బాంధవి

# ఉరఫ్

# పాపాలభైరవి

మూలం :

పి.జి.వుడ్‌హౌస్

అనుసృజన :

గబ్బిట కృష్ణమోహన్

# ఆపద్బాంధవి–ఉరఫ్–పాపాలభైరవి

జనవరి నెల చివరి రోజులు, హైదరాబాదులో వాతావరణం చల్లగా ఆహ్లాదకరంగా వుందారోజు. ఒకప్పుడు మళయాళం సినిమాల్లో టాప్ హీరోయిన్‌గా పేరుపొందిన కుంజురాణీదేవిగారి ''కుంజురాణీ నివాసం'' ముందటి ఆవరణ నీరెండలో చలి కాచుకుంటోంది. కుంజురాణీదేవి చనిపోయి సంవత్సరం దాటింది. ఇప్పుడా యింటికి యజమానురాలు శ్రీమతి రత్నమాలా మునుస్వామినాయుడుగారయినా, యింకా 'కుంజురాణీ నివాసం' గానే వ్యవహరిస్తుంటారందరూ.

ఆ యిల్లు బంజరా హిల్సులో ఎత్తుగా గుట్టమీదుంది. గేటు ముందున్న రోడ్డు మరి కొంచెం పైదాకా వెళ్లి ఆగిపోతుంది. తరవాత వున్నవన్నీ చెట్లు, పుట్టలు, గుట్టలూ. విశాలమైన ఆ యింటికి ముందువైపు స్విమ్మింగ్ పూలు, గులాబీ తోట, సపోటా చెట్లు, కొన్ని మామిడి చెట్లు వగైరా వున్నాయి. ఇవన్నీ నీరెండలో వెలుగుతున్నా యింటిముందు ఆవరణలో వాలుకుర్చీలో కూచుని – మితంగా తినడమనేది తెలీక వొళ్లు పెంచేసుకున్న రోమను ప్రభువులా అనిపించే వయసుడిగిన పెద్దమనిషి మనసుని మాత్రం ఆ నీరెండ వుత్తేజపరచడంలేదు. అతని పేరు రంగయ్యనాయుడు – శ్రీమతి రత్నమాలాదేవి భర్తకి స్వయానా తమ్ముడు. బోనులో పెట్టుంచినవాడిలా ఏదో పోగొట్టుకున్నట్టు ముభావంగా కూచుని అప్పుడే కళ్లముందొచ్చిన ఆకారాన్ని గమనించాడు.

పొడుగ్గా సన్నగా వున్న ఆ ఆకారం ఆయింట్లో పనిచేసే బట్లరు శేషయ్యది. పొడుగాటి గ్లాసు నిండా నింపున్న బార్లీ వాటరుని ట్రేలో పెట్టుకుని హుందాగా నడిచొస్తున్నాడతను. రత్నమాలాదేవి యింట్లో వుండే ప్రతి వస్తువు ఆవిడగారి ఐశ్వర్యాన్ని, ఘనతని చాటి చెప్తుతాయి. అందులో మరింత ముఖ్యంగా చాటి చెప్పేది – బట్లరు శేషయ్య వునికి. తెల్లదొరల దగ్గిర పనిచేసి అపారమైన అనుభవం గడించాడు. వాళ్ళ దగ్గిర తర్ఫీదు పొందిన వాడైతే నిక్షేపంలా వుండిపోతాడు. అంతకు మించినవాడు దొరకటం అసాధ్యం.

ఇష్టమైన మేనల్లుడి మీద ఔదార్యం చూపించే మేనమామలా, 'తవఁరికి బార్లీ వాటరు తెచ్చాను, పుచ్చు కోండయ్యా' అన్నాడు శేషయ్య.

ఎండకి వొళ్ళు కాచుకుంటున్న రంగయ్యనాయుడు పగటికలలు కంటూ, తను అత్యంతంగా యిష్టపడే విస్కీకి బదులు ఆ టైములో రోజూ తప్పకుండా గ్లాసెడు బార్లీ వాటరు పుచ్చుకోవాలనే ఆంక్షని వదినెగారు విధించిన సంగతి మర్చిపోయాడు. చేతిలోకి గ్లాసు తీసుకుని అయిష్టంతో వాసన చూశాడు. పనిచేసే మెకానిక్‌లు చేతులు తుడుచుకోడానికి వాడే గుడ్డముక్కలాంటి వాసనేస్తోందని భావించి, ఆ ముక్కే పైకి అన్నాడు.

తవఁరన్నదాంతో ఎంతో కొంత పోలిక వున్నట్టు తనకి కూడా అనిపిస్తోందని జాలిగా మర్యాద చూపిస్తూ జవాబిచ్చాడు శేషయ్య.

'అవుతే ఆరోగ్యానికి చాలా మంచిదంటారయ్యా. పంజాబులో రైతులు కుండలకొద్ది తాగుతారంటయ్యా. అందుకే ఆళ్ళ బుగ్గలెప్పుడూ విచ్చుకున్న మందారాల్లా ఎర్రగా నిగనిగలాడతాయంటారయ్యా.'

'సర్లే, ఎర్రబుగ్గల రైతులెవడికి కావాలిటా?'

'అవునయ్యా, అదీ నిజవేఁలేండయ్యా.'

'ఎర్రబుగ్గల రైతెవడన్నా కనిపిస్తే నువ్వే అట్టిపెట్టుకో.'

'చిత్తం, అలాగేనండయ్యా.'

గట్టి ప్రయత్నంతో అయిష్టంగానే గ్లాసులోది గుటికెడు తాగి చూశాడు. గుక్క తిప్పుకునేందుకు ఒక నిమిషంపాటు ఆగి, కింద కనిపిస్తున్న వూరు వంక చిరాగ్గా చూశాడు.

'ఎందుకొచ్చిన జీవితంలే నాది, శేషయ్యా!' అన్నాడు రంగయ్యనాయుడు.

'చిత్తం'.

'కుక్కలక్కూడా వద్దు బాబూ ఇలాంటి నికృష్టపు జీవితం'.

'ప్రపంచవంతా దుఃఖంతో నిండుందయ్యా,' నిట్టూరుస్తూ అన్నాడు శేషయ్య.

అతను చూపిస్తున్న సానుభూతి రంగయ్యనాయుడికి రుచించలేదు.

'దుఃఖం సంగతి నీకేం తెలుస్తుందయ్యా,' అన్నాడు చిరుకోపంతో. 'చీకూ చింతా లేని బట్లరు వుద్యోగ మాయె నీది. ఇక్కడ బాలేదనిపిస్తే యింకో చోటికి పోవచ్చు నువ్వు. నేనాపని చెయ్యగలనా చూడు? నువ్వెప్పుడైనా జెయిల్లో వుండొచ్చావా శేషయ్యా?'

ఆ ప్రశ్నకి శేషయ్య నివ్వెరపడ్డాడు, కంగారు కూడా మొదలైంది.

'నాకు తెలుసు, గడపలేదని. అంచేత నా పరిస్థితి నీకర్థం కాదు'.

రంగయ్యనాయుడు బార్లీ వాటరు పూర్తిగా తాగేసి మౌనంగా ఆలోచిస్తూ వుండిపోయాడు. అన్నగారైన మునుస్వామినాయుడుగారి వీలునామా గుర్తుకు తెచ్చుకుని దాంట్లో ఆ మనిషి తేటతెల్లంగా రాసినదాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్కవిధంగా భాష్యం చెప్పగలరన్న విషయం తలుచుకుంటే బాధ వేసింది. మునుస్వామినాయుడు ఆస్తినంతా భార్య రత్నమాలాదేవి పేరిట వీలునామాలో రాస్తూ, తన తదనంతరం తమ్ముడు రంగయ్యనాయుడి జీవనానికి ఆవిడగారు ఆధారం కలగచెయ్యాలని షరతు పెట్టి వదిలాడు. గందరగోళానికి, దురవగాహనకి దారి తీసేందుకు యిదో గొప్ప వుదాహరణ అని చెప్పవచ్చు. అసలొక ఆడది యింకో మగాడికి జీవనాధారం కలగ చెయ్యాలనే షరతు వెనకాలున్న వుద్దేశ్యం, రంగయ్యనాయుడి అవగాహన ప్రకారమైతే – మంచి ఏరియాలో తనకో యిల్లు కట్టించి యిచ్చి, యిల్లు గడవటానికి, కారు నడపటానికి, యింకా రెండు మూడు క్లబ్బుల్లో మెంబరవటానికి, అలాగే సంవత్సరానికోసారి సిమ్లాలోనో, వూటీలోనో గడిపొచ్చేందుకూ వగైరా వగైరాలకి సరిపడేంత వనరులు ఆవిడగారు సమకూర్చాలి – అని. అయితే, పొదుపుగా జీవితం వెళ్ళబుచ్చే రత్నమాలాదేవి అవగాహన ఏమిటంటే – భర్త విధించిన షరతు ప్రకారం కేవలం మరిదిగారికి పడుకోడానికి పక్క, మంచం; ముప్పూటలా తిండి, వుండటానికి యింట్లో యింత చోటు – అని. అదిగో, రంగయ్యనాయుడి దినచర్య సరిగ్గా ఆ పంథాలోనే నడుస్తోందిప్పుడు. సుష్టుగా తినడం, కావలసినన్ని మజ్జిగ తాగటం, హాయిగా నిద్రపోవటం తప్పించి ఆ దురదృష్ట వంతుడికి ఏళ్ళ తరబడి మరో వ్యాపకం లేక జెయిల్లో ఖైదీలా మగ్గుతున్నాడు.

ఆలోచనల్లోంచి బయటకొచ్చి చిన్నగా నిట్టూర్చాడు. జాలిపడుతూ నుంచున్న బట్లరు శేషయ్యని ఆంతర్యం లోకి తీసుకుని తన మనసులో వున్నది దాచకుండా అతని దగ్గిర వెళ్ళబోసుకోవాలని అనిపించింది.

'శేషయ్యా, అసలు నేనేమిటో తెలుసా?'

'అయ్యా?'

'బంగారు పంజరంలో బంధించిన పక్షినయ్యా'.

'నిజవాఁయ్యా?'

'నేనో క్రిమికీటకం లాంటివాణ్ణి'.

'నన్ను కంగారెట్టేస్తున్నారయ్యా తవఁరు. పంజరంలో బంధించిన పక్షిలాంటోరని గదా నేనర్థం చేసు కున్నది?'

'పురుగుని కూడానయ్యా. కాలికింద నలిగే పిపీలికాన్ని. కనుచూపుమేరలో వెలుగనేది చూడలేని పురుగుని. తాలుకా ఆఫీసుల్లో వుంటారే, వాళ్ళనేమంటారు?'

'తాశిల్దార్లా అయ్యా?'

'బంట్రోతులు. నేనొట్టి బంట్రోతుని. రా ఇక్కడికి, ఫో అక్కడికి అంటూంటే ఆ ఆజ్ఞల్ని శిరసావహించేవాడిని. ఇనపపాదంతో నొక్కుతూ కుక్కలా చూస్తారే – అలాంటివాణ్ణి. మనసుని మరీ బాధించే విషయమేమిటంటే ఒకప్పుడు నాదగ్గిర బోలెడు డబ్బుండేది. లెక్కలేనంత డబ్బు. ఇప్పుడైతే అంతా వూడ్చిపెట్టుకు పోయింది.'

'అవునాయ్యా?'

'అవును, అంతా పోయింది. హారతి కర్పూరంలా హరించుకుపోయింది. వున్న ఆస్తిని చేతులారా పోగొట్టుకున్నా. శేషయ్యా, విచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెట్టేవాళ్ళందరికీ గొప్ప గుణపాఠమయ్యా యిది.'

'చిత్తవంయ్యా.'

'ఆస్తి పోగొట్టుకోవడం ఎంత తెలివితక్కువ పనయ్యా. క్షమించరాని నేరం. చేతిలో చిల్లిగవ్వ లేకపోతే ఏవిటి నీదారి?'

'మరేనండయ్యా.'

'మరేనండయ్యా అన్నదే కరెక్ట్. నాకో వెయ్యి రూపాయలు అప్పుగా సర్దాలయ్యా?'

'సర్దలేనయ్యా.'

అతను అప్పిస్తాడని రంగయ్యనాయుడికి ఏకోశానా అనిపించలేదు. అయితే, ఒక్కటంటే ఒక్కరోజు – రాత్రంతా హాయిగా ఆ మహానగరంలో వుండే విలాసవంతమైన ప్రదేశాల్లో గడపాలనే కోరిక బలీయంగా ప్రబలడంవల్ల అలా ప్రస్తావించాల్సి వచ్చిందతనితో. ఈ బట్లర్లున్నారే వీళ్ళు డబ్బు బాగా కూడబెడతారని తెలుసతనికి. పదిలంగా దాచుకున్న ధనాన్ని అందరూ కలిసి పంచుకుని సద్వినియోగం చెయ్యాలనే దాంట్లో గట్టి నమ్మకమున్నవాడు రంగయ్యనాయుడు.

'పోనీ, ఓ అయిదొందలు?'

'లేవయ్యా.'

రంగయ్యనాయుడు అత్యాశ పడే వ్యక్తి కాదు, సమయాసమయాల్ని బట్టి సర్దుకుపోయే విచక్షణాజ్ఞానం వుంది. 'అయిదొందల్తో సరిపెట్టుకుంటాన్లేవయ్యా,' అన్నాడు.

'నాదగ్గిర్లేవయ్యా.'

రంగయ్యనాయుడు యింక వదిలేశాడు. డబ్బు వృధా చెయ్యకూడదని యింతకుముందే తను అనడం చాలా తప్పని ఆలశ్యంగా గుర్తించాడు. ఎదుట నుంచున్నవాడికి స్వతహాగా తట్టకపోయినా వాడి బుర్రలోకి తనే ఎక్కించినట్టు అయింది. ముఖం చిట్లిస్తూ చిరాగ్గా కూచునుంటే ప్రాణం ఒక్కసారి లేచొచ్చినట్టయింది. ఈ దరిద్రపు కొంపలోకి నిన్ననే కావుడు వచ్చి చేరిందనేది ఠక్కున గుర్తొచ్చింది. ఆమె రాకతో పరిస్థితులు మారుతాయి. అప్పు చెయ్యడానికి అంత మంచి వనరు వుండగా ఆ సంగతెలా మర్చిపోయాడో అర్థం కాలేదతనికి. కామాక్షీదేవి ('కావుడు') – రత్నమాలాదేవికి స్వయానా చెల్లెలు. బంధుత్వరీత్యా తనకి మరదలు; మరి రక్తసంబంధం అన్నిటికన్నా గొప్పదైనందుకు కాస్తంత అప్పుకి – వెయ్యి రూపాయలంత చిన్న మొత్తానికి – ఆవిడే సరి. అంతేకాదు, యింతప్పట్నించీ కావుడిని తను బాగా ఎరిగున్నాడు కూడా.

'కామాక్షీదేవి ఎక్కడున్నారు, శేషయ్యా?'

'తోట పక్కనున్న గదిలో వుందారయ్యా. రత్నమాలాదేవమ్మగోరి జ్ఞాపకాలు రాసుకుంటున్నారయ్యా.'

‘సరే, మంచిది. నువ్వెళ్లింక.’

‘మంచిదయ్యా.’

హుందాగా నడుస్తూ బట్లరు నిష్క్రమించాడు. రంగయ్యనాయుడికి కొంచెం మగత కమ్మినట్టనిపించి, కావుడు నించి అప్పు రాబట్టే విషయాన్ని కాసేపటిపాటు వాయిదా వేశాడు. కళ్లు మూతలు పడ్డాయి. అంతలోనే అతను పెడుతున్న గురక – చుట్టుపక్కల మసలుతున్న క్రిమి కీటకాలు చేస్తున్న రొదతోనూ, ఆకుల సందుల్నించి గాలి చేసే శబ్దాలతోనూ కలిసిమెలిసిపోయింది. ఆ మహానుభావుడు విశ్రాంతి తీసుకుంటున్నాడు.

శేషయ్య వంటింట్లోకి చేరి గ్లాసుడు నిమ్మరసంలో కాస్తంత వుప్పు, రెండు ఐసు ముక్కలు వేసుకుని తాగుతూ హైరాణ తీర్చుకుంటున్నాడు. ఆరోగ్యప్రదమైన ఆ ద్రవాన్ని చప్పరిస్తూ కనుబొమలు ముడిచాడు. కొంచెం సీరియస్‌గా ఆలోచిస్తున్నాడెందుకో. ఇంట్లో తిరిగే పెంపుడు పిల్లి ఓదారుస్తున్నట్టు అతని రెండు కాళ్లనీ రాసుకుంటూ తిరిగింది. దాన్నసలు పట్టించుకోలేదు. పిల్లుల్ని దగ్గిరకి తీసుకుని ముద్దాడేందుకు సమయం సందర్భం వుంటాయి; ముద్దాడకూడని సమయం, సందర్భాలూ వుంటాయి. ఇంతకుముందు బయట జరిగిన సంభాషణలో రంగయ్యనాయుడు – శేషయ్యది చీకూచింతా లేని జీవితమన్నాడు. అయితే సామాన్యులు వూహించుకునే విధంగా కేవలం అది సరైన అవగాహన లేనందుకే. బట్లర్లు ముసుగు తగిలించుకుని వృక్షపక్షిలా వుండటం వల్ల మొహాల్లో ఏ విధమైన హావభావాలు కనిపించనీయరు. వంటగదిలో కూర్చుని వూర్కే మథన పడుతున్న ఆ కపటవ్యక్తిది చీకూ చింతా లేని జీవితమనేది ఏవిధంగానూ వర్తించదు. మోకాళ్ళ మీద మోచెయ్యి ఆనించుకుని, అరచేతుల్లో గడ్డం పెట్టుకుని కనక కూచునుంటే ప్రగాఢంగా ఆలోచిస్తున్న శిలాప్రతిమలా కనిపించేవాడతను.

ముందురోజు సాయంత్రం వీధి గుమ్మం తలుపు తెరవగానే కామాక్షీదేవి యింట్లోకి ప్రత్యక్షమైనప్పటినించీ అతని మనసు మనసులో లేదు. ఆవిడ గురించే అతనింకా ఆలోచిస్తున్నాడు. ఆవిడగారు ఈ యింట్లో వూడిబడేటట్టు చేసిన విధిని తిట్టుకుంటున్నాడు. ఇప్పుడావిడ వచ్చినందుకు ఫలితం ఎలా వుంటుందానని తనలో తను వందసార్లు ప్రశ్నించుకున్నాడు. ఇదంతా పాత కథే. ఆవిడకంతా తెలుసు. ఆవిడగారు నోరు విప్పకుండా వుండటం మీదనే తన భవిష్యత్తు ఆధారపడుంది. అయితే శేషయ్య బుర్రని మహా తొలుస్తున్న ప్రశ్నల్లా – ఆడవాళ్ళు నోరు విప్పకుండా ఎప్పుడైనా వుండగలరా? అని. నిజానికి యిప్పటివరకైతే బుడగ పేలలేదు. అంచేత తన రహస్యం యింకా బయటికి పొక్కలేదు. పరిస్థితులు ఎల్లకాలం యిలాగే వుంటాయా? ఇంతలో బెల్లు మోగింది. చూడగా తోట పక్కనున్న గదిలోంచి పిలుపొచ్చిందని గ్రహించాడు. విధి నిర్వహణ అనేది భగవంతుడి ఆజ్ఞ అనో, దాదాపు అలాంటి అర్థం వచ్చే మాటల్నో మనసులో అనుకుని, తాగుతున్న నిమ్మరసం గ్లాసుని పక్కకి పెట్టేసి ఆ వైపుకి బయల్దేరాడు శేషయ్య.

తోటని ఆనుకునున్న గది – లైబ్రరీ రూంకి పక్కగానూ, రత్నమాలాదేవి ట్రోఫీలు, జ్ఞాపికలు దాచుకున్న గదికి సరిగ్గా కిందిభాగంలోనూ వుంది. ఇంటిముందున్న స్విమ్మింగ్ పూల్ వైపుకి తెరుచుకునే నిలువుకిటికీకి పక్కగా రాసుకోటానికి పెద్ద టేబులూ, కుర్చీలు వున్నాయి. నులివెచ్చని కిరణాలు గదిలోకి ప్రవేశిస్తున్నాయి. ఇష్టపడేవాళ్ళు కిటికీలోంచి బయటి ప్రకృతిని తిలకిస్తూ కోర్చోవచ్చు. కుమారి కామాక్షీదేవి టేబులు మీదున్న కాగితాల మీద బరబరా రాసుకుంటూపోడంతో ఆమె ధ్యాస బయటి ప్రకృతి వైపు మళ్ళలేదు. ఇందాక శేషయ్య చెప్పినట్టు యిప్పుడామె, అక్క రత్నమాలదేవి స్వీయచరిత్ర – *జ్ఞాపకాలు* – అన్న గ్రంధాన్ని *ఘోస్ట్ రైటర్* (తెలుగు అకాడెమి నిఘంటువు ప్రకారం – తాను రాసి యజమాని పేర ప్రచురించుకోనిచ్చే కళాకారుడు, సాహితీవేత్త)గా రాయడంలో పూర్తిగా నిమగ్నమైంది.

కామాక్షీదేవికి నలభయ్యోపడి దాటింది. కొంచెం స్థూలకాయురాలు. అయినా చురుగ్గా, సరదాగా అందర్తో కలివిడిగా మెలిగే వ్యక్తిత్వమున్న మనిషి. ముడతలు పడ్డ చీర కట్టుకునుంది. గరుకు మొహం, ఎత్తుగా పొడుచుకొచ్చిన బుగ్గలు, పట్టుదలని సూచించే గడ్డంతో ఆమె కరుగ్గా కనిపించినా చిలిపితనంతో మెరుస్తూండే పెద్ద పెద్ద కళ్ళు ఆ కర్కశత్వాన్ని మరుగునపెడతాయి. అక్కగారంత అందగత్తె కాదు, అయినా ఒకవిధమైన ఆకర్షణ

ఏదో ఆమె ముఖంలో వుంది. స్నేహపూరిత స్వభావం. అంచేత అందరితోనూ కలిసి మెలిసి తిరుగుతుంది. ఒక రంటే మరొకరికి ఏమాత్రం గిట్టని తెలుగు సినిమారంగంలో కూడా కామాక్షీదేవి అంటే అందరికీ యిష్టం.

రాసేది గట్టిగా పైకి చెప్పుకుంటూ రాయటం ఆవిడగారి అలవాటు. నిజానికి *పైకి చెప్పుకుంటూ* అన్నది చాలా సున్నితమైన వివరణ. మామూలప్పుడే ఆవిడ గొంతు తారాస్థాయిలో వుంటుంది. ఒకప్పుడు సంబంధం–షణ్ముగం పిక్చర్సులో ఆమెతోబాటు పనిచేసిన స్నేహితుడు, వర్ధమాన రచయిత రవికుమార్ అనే కుర్రాడు ఆవిడ గారి గొంతుని విశ్లేషిస్తూ – అస్సాంలో వున్న చెవిటి స్నేహితుడిని ఆవిడగారు యిక్కడ్నించే పలకరిస్తున్నట్టుగా వుంటుందని, అన్నివిధాలా సంపాదన మృగ్యమైతే చివరికి ఆ గొంతుని వుపయోగించి పచ్చిక బీళ్ళలో పశువుల్ని అదిలిస్తూ జీవనం గడుపవచ్చనీ – తన వ్యక్తిగత అభిప్రాయంగా చెప్పాడు.

'సినిమా ప్రపంచం!' అంటూ బిగ్గరగా అరిచింది కామాక్షీదేవి రాసుకుంటూ. 'నేను మొట్టమొదటిసారి సినిమా ప్రపంచంలో అడుగుపెట్టిన రోజున నాలో చెలరేగిన భావాల్ని ఏవిధంగా వర్ణించగలను? నాకప్పుడు వయసు పదహారేళ్ళు. అబద్ధాల కోరు! నీకప్పుడు సుమారు యిరవయ్యేళ్ళు కాదూ. 'లేత వయసు, ఏమీ తెలియని బేలతనం. కళ్ళు బార్లా అప్పగించి చూస్తూ కూచున్నాను. ఒట్టి ఒక ...

తలుపు తెరుచుకుంది. శేషయ్య వచ్చాడు. ఆగమన్నట్టు కామాక్షీదేవి చెయ్యి పైకెత్తి చూపించింది.

'... పిరికి పిల్లని నేను,' అంటూ ముగించి, 'ఏవిటి శేషయ్యా?' అని అడిగిందతన్ని.

'తవఁరే బెల్లు కొట్టి పిలిచారు, మేడమ్.'

కామాక్షీదేవి అవునన్నట్టు తలూపింది.

'ఆ అవును. శేషయ్యా, నీతో ఒక విషయం ముచ్చటించాలనుందయ్యా. ఏదో అదీ యిదీ ఆలోచిస్తూ గడుపుతుంటే యిప్పుడే తోచింది. ఓ గుక్కెడు కాఫీ కనక వెంటనే నా గొంతులో పడకపోతే చచ్చిపోతానని అని పిస్తోందయ్యా. బ్లాక్ అండ్ వైట్ సినిమాల్లో నటించిన హీరోయిన్‌గారి *జ్ఞాపకాలు* అన్న పుస్తకం నువ్వెప్పుడన్నా రాశావా?'

'లేదు మేడమ్.'

'ఆ పనుంది చూశావూ, అది నిజంగా శరీరాన్ని రొష్టు పెట్టిస్తుందయ్యా.'

'అందులో సందేహం లేదు, మేడమ్.'

'మరైతే యిప్పుడు నాకో కప్పు స్ట్రాంగ్ కాఫీ తేగలవా?'

'తప్పకుండా మేడమ్.'

'ఆవులకి, ఎద్దులకి మెడలో గంటలు కట్టినట్టు నువ్వు కూడా ఫ్లాస్కునిండా కాఫీ పోసుకుని మెడకి తగిలించుకుని తిరుగుతుంటే మంచిదనిపిస్తుందయ్యా. క్షణంలో సిద్ధంగా వుంటుంది. ఆలస్యం వుండదు.'

'వుండదు, మేడమ్.'

టేబులుకి నిగడదన్ని కూచున్న కామాక్షీదేవి కాళ్ళు దగ్గిరికి లాక్కుని పొధంగా కూచుంది. కుర్చీ వెనక్కి తోసి ఎదుట నుంచున్న ఆ బట్లర్ని కళ్లార్పకుండా నిశితంగా చూసింది. తను వచ్చిన తరవాత అతన్తో విడిగా కలిసి మాట్లాడటానికి యింతవరకు అవకాశం దొరకలేదు. వాళ్ళిద్దరూ చాలా చాలా విషయాలు చర్చించుకోవాలని తోచిందామెకి.

'తమ్ముడు శేషయ్యా, నువ్వు చాలా ముభావంగా పొడిపొడిగా ఒకే ఒక్క మాటతో జవాబిస్తూ దూరం దూరంగా వుంటున్నావెందుకు? నా రాక నీకు యిబ్బందిగా వుంది కదూ?'

'అవును, మేడమ్.'

'అందులో ఆశ్చర్యంలేదు. నీ అంతరాత్మే నిన్నలా చేయిస్తోంది. నీ గుట్టు నాకు తెలుసు, శేషయ్యా.'

'అవును, మేడమ్.'

'చూడంగానే గుర్తుపట్టేశాన్లే. నీ మొహముంది చూశావూ, దాని బొమ్మ బుర్రలో ముద్రపడే టైపయ్యా. బహుశా ఆ విషయం గురించి నేనేం చేస్తానా అని ఆలోచిస్తున్నావిప్పుడు, అవునా?'

'అవును, మేడమ్.'

కామాక్షీదేవి చిన్నగా నవ్వింది. ఆవిడ నవ్వితే గుండెలో దాక్కున్న దీపం వెలిగినట్టు ముచ్చటగా వుంటుంది. అది చూసి ముందురోజు మధ్యాహ్నం మూడు గంటల్నించీ మధనపడుతున్న శేషయ్యకి గుండె బరువు ఒక్కసారి దించినట్టయింది.

'ఏమీ చెయ్యను,' అందామె. 'నా నోటికి తాళం వేసేశాను. ఆ చేదునిజం నా దగ్గిర భద్రంగా వుండి పోతుంది. అంచేత, తమ్ముడు శేషయ్యా, నువ్వు హాయిగా నవ్వుతూ పేలుతూ వుండిపో. నీ నవ్వు గురించి చాలా చాలా విన్నా. ఏదీ ఒక్కసారి చూపించు నీ ఘనత.'

శేషయ్య నవ్వలేదు. బట్లర్ల నియమావళి ప్రకారం వాళ్ళు నవ్వు చూపించుకోకూడదు. అయినా శేషయ్య మాత్రం కొద్దిగా పెదిమలు కదిలిస్తూ ఆ మహానుభావురాలి వైపు సాదరంగా చూశాడు. మూడు సంవత్సరాల కిందట తనని జైలుకి పంపించినప్పుడు – అది తగిన శిక్షే – అంటూ రాసిన పత్రికా విలేఖరి వైపు అలాంటి చూపు చూస్తానని అతడు ఏకోశానా అనుకోలేదు. మనసులో మెదులుతున్న భావాల్ని మాటల్లో రూపుదిద్దటానికి ఒకటి రెండు క్షణాలు పట్టిందతనికి.

'తవఁరింత దయ చూపిస్తున్నందుకు తవఁరి రుణం తీర్చుకోలేను, మేడమ్. నేనైతే మహా భయపడ్డాను. తవఁరు కాస్తా వున్నపళాన్న దాన్నొదలకొట్టేశారు. ఈ వుద్యోగం వొదులుకోడం నాకెంతమాత్రవూఁ యిష్టంలేదు మేడమ్.'

'ఏం, ఎందుకు? ఇలాంటి వుద్యోగం యింకెక్కడైనా దొరుకుతుంది గదయ్యా. ఈ పేటలో ఏ యింటికెళ్ళి అడిగినా కళ్ళకద్దుకుని ఎర్ర తివాచీ పరుస్తూ ఆహ్వానిస్తారు కదయ్యా నిన్ను.'

'అది నిజమేగాని మేడమ్, రత్నమాలాదేవిగారి కొలువు వదులుకోకపోవటానికి కొన్ని ప్రత్యేకమైన కారణా లున్నాయి.'

'ఏమిటా కారణాలు?'

'పూర్తిగా వ్యక్తిగతమైన కారణాలు, మేడమ్.'

'ఓ, అలాగా. సరే, నిన్ను మాత్రం పట్టివ్వనులే.'

'తవఁరికి చాలా చాలా కృతజ్ఞుణ్ణి, మేడమ్.'

'కలవరపెట్టి మనస్తాపం కలిగించినందుకు నాకే చాలా బాధగా వుందయ్యా. వీధి గుమ్మంలో నిన్న నేను కనిపించగానే వొళ్ళు జలదరించి భయమేసుండాలి కదూ.'

'అవును, మేడమ్.'

'పిశాచాన్ని చూసినట్టు జడుసుకుని భయం పట్టుకునుండొచ్చు కదూ.'

'ఆ సమయంలో నేను చెందిన ఆందోళన యించుమించు అలానే వుండింది, మేడమ్.'

కామాక్షీదేవి ఒక నిమిషం ఆలోచించింది.

'నువ్వు నన్నింకా గుర్తుపెట్టుకోటం చిత్రంగా వుందయ్యా. మనం కలిసిన సమయంలో బహుశా నీకు అక్కడున్న మనుషుల మొహాలు చూడ్డం తప్పించి ఆరోజున మరో వ్యాపకమేదీ లేదనుకుంటా.'

'వేరే పనేవీఁ లేదు, మేడమ్. టైము గడిపేందుకు అదొక్కటే మార్గం.'

'నిన్ను జైలుకి పంపడం చాలా దురదృష్టం.'

'అవును, మేడమ్.'

'కోర్టు ముందుంచిన సాక్ష్యాధారాల్ని ఎవరూ తోచిపుచ్చలేరుగా?'

'తోసిపుచ్చలేరు కానీ, దయచేసి తవఁరు గొంతు కొంచెం తగ్గించి మాట్లాడితే బాగుంటుందేమో, మేడమ్. గోడలకి చెవులుంటాయంటారు.'

'ఏవిటీ, గోడలకి ఏముంటాయటా?'

'చెవులు, మేడమ్.'

'ఓ, చెవులుగదూ! అవునవును. వుంటాయి, ఎందుకుండవు?' గొంతు బాగా తగ్గించి రహస్యం అడుగుతున్నట్టు, 'ఇంతకీ రాజమండ్రి సెంట్రల్ జైలు జీవితం ఎలా అనిపించింది?' అని అడిగింది.

'ఏవీఁ బాలేదు, మేడమ్' సౌండు తగ్గించి శేషయ్య కూడా రహస్యం చెబుతున్నట్టు బదులిచ్చాడు.

'బాగుండదని నేనూ వూహించగలన్లే,' కామాక్షీదేవి గొంతు యింకొంచెం తగ్గించి రహస్యంగా అంది.

కునుకు ముగించిన రంగయ్యనాయుడు నిలువుకిటికీలోంచి లోపలికొచ్చాడు. అది చూసి, 'ఓ, హల్లో రంగడుబావా,' అంటూ పలకరించింది.

బట్లర్ని వెయ్యిరూపాయల అప్పు అడిగి లేదనిపించుకున్న డబ్బులేని పెద్దమనుషులు – యివ్వను ఫో అని మోరాయించినందుకు తప్పుబట్టి చూసినట్టు – రంగయ్యనాయుడు చూసిన చూపు వెంబడిస్తుండగా శేషయ్య వెళ్ళిపోయాడు.

'కావుడూ, నీతో కొంచెం మాట్లాడాలి,' అన్నాడతను.

'తప్పకుండా గురుడా. నీ మెదడుని ఏం తొలుస్తోంది నాయనా? రంగడుబావా, యిదేవిటి కిందటిసారి చూసినప్పుడు బానే వున్నావు, యిదింతలోపల ఎంత ముసలితనం వచ్చేసిందయ్యా నీకు?' పాతిక సంవత్సరాల పాటు అతన్ని ఎరిగున్న కారణంతో స్నేహంగా చొరవ తీసుకుని అడిగిందామె. 'ఇక్కడికి రాగానే నీ వాలకం చూసీ, మ్యూజియంలో ప్రదర్శించతగ్గ నీ అవతారాన్ని చూసీ విస్తుపోయాననుకో. నీ జుట్టయితే ముగ్గుబుట్టలా పండిపోయింది బావా.'

'రంగు వేయించుకోవాలనుకుంటున్నా.'

'దానివల్ల ఏమాత్రం వుపయోగముండదయ్యా. తెల్ల జుట్టుకి ఒక్కటే ఒక్క మందుంది. ఓ ఫ్రెంచివాడు కనిపెట్టాడు దాన్ని. దానికి *గిలొటిన్* అని పేరు పెట్టాడతను. దీనికి అసలు కారణం ఏళ్ళ తరబడి మా అక్క రత్నమాలతో కలిసి వుండటమేనని నాకనిపిస్తోంది. నల్లగా నిగనిగలాడుతున్న జుట్టులో వెండి పోగులు రావటానికి ప్రబలమైన కారణం ఏదన్నా వుందా అంటే అది, ముప్పొద్దులూ మా అక్కతో గడపటం తప్ప మరోటి కాదని వూహించగలన్లే.'

ఆమె మాటలు రంగయ్యనాయుడి చెవికి మధురమైన సంగీతం విన్నట్టు అనిపించాయి. ఆమె చూపిస్తున్న ఆర్ద్రతకి కరిగిపోయాడు. ఎప్పుడూ యిలాగే సానుభూతి చూపిస్తుంది, ఎంత మంచిదో కదా కావుడు అని తనలో తను చెప్పుకున్నాడు. ఆజన్మాంతం కఠోర బ్రహ్మచారిగానే వుండిపోవాలని నిర్ణయించుకున్నాడెప్పుడో. దానికి కట్టుబడి వుండాలన్న దృఢసంకల్పమే ఒకటిరెండుసార్లు పెళ్ళి చేసుకుంటావా అని అడగటానికి అడ్డమొచ్చి ఆపే

సింది. ఎప్పుడన్నా మనసు బాలేనప్పుడు ఆ సంగతి గుర్తుకు తెచ్చుకుని విచారిస్తాడతను. కాసేపటికి మనసు కుదటబడగానే ఆవిషయం మటుమాయమవుతుంది. సంసార బంధాల్ని తలుచుకుంటే రంగయ్యనాయుడికి కంపరం పుడుతుంది.

ఆమెతో పూర్తిగా అంగీకరిస్తూ యిలా అన్నాడు: 'నాది కుక్కలాంటి నికృష్ట జీవితమనుకో. కావుడూ, నా మీద పెత్తనం చెలాయిస్తుందావిడ. పోయి ఏ అండమాన్లోనన్నా దాక్కునుంటే బాగుండేది. ఈ బార్లీ నీళ్ళు తాగటమన్నా తప్పేదక్కడ.'

'రత్నమాలక్క నీచేత బార్లీ నీళ్ళు తాగిస్తుందా?'

'ప్రతిరోజూ.'

'అమానుషం. అయినా ఆరోగ్యానికి మంచిదిలే.'

రంగయ్యనాయుడు వద్దన్నట్టు గబగబా చెయ్యి వూపాడు.

'దయచేసి ఒక్క వుపకారం చెయ్యి. పంజాబు రైతుల వూసు మాత్రం నా దగ్గిర ఎత్తకు.'

'ఏ రైతుల గురించయ్యా నువ్వనేది?'

'అదే బుగ్గలు ఎరుపెక్కిస్తుందంటారే, వాళ్ళే.'

'పంజాబు రైతుల బుగ్గలు బార్లీ వాటరు తాగినందుకు ఎరుపెక్కుతాయా?'

'అని శేషయ్య చెప్పాడు.'

కామాక్షీదేవి మొహంలో చిరుమందహాసం తొణికింది.

'శేషయ్యా? నా నోరు కుట్టేసుకున్నానని మాటిచ్చాను కాని, లేపోతే శేషయ్య గురించి నీకో విషయం చెప్పుండేదాన్ని. పైకి ప్రశాంతంగా కనిపిస్తుండే చెరువుల గురించి విన్నావా ఎప్పుడన్నా?'

'ఏవిటో వాటి విశేషం?'

'చాలా లోతుగా వుంటాయవి. *స్టిల్ వాటర్స్ రన్ డీప్* – శేషయ్య తీరు కూడా అంతే. ఎంత ఘటికుడనుకున్నావ్! నువ్వింకా అతన్ని మామూలు బట్లరే అనుకుంటున్నావేమో. ఒకవిషయం చెప్తా విను. తమ్ముడు శేషయ్యకి యింకో మారురూపం వుంది. నా పెదిమలు కుట్టేసుకున్నందుకు దానిగురించి వివరాలడిగి ప్రయోజనం లేదు.'

రంగయ్యనాయుడు ఆశ్చర్యపడ్డాడు.

'నిన్ననేగా నువ్విక్కడికొచ్చింది, శేషయ్య గురించి నీకెలా తెలుసు? నీకతను ముందే పరిచయమా?'

'ఇంతకు ముందోసారి కలిశానతన్ని, కాని వేరే పరిస్థితుల్లో. ఇహ నన్నేం అడక్కు.'

'నాకు అడగాలని లేదులే. శేషయ్యతో నాకెలాంటి సంబంధం లేదు. జీవితంలో మళ్ళీ అతన్తో పెట్టుకోను కూడా. నన్ను అవమానించాడు శేషయ్య, నిరాశ పరిచాడు.'

'నిజంగానే అంటున్నావా? ఏం జరిగిందేవిటి?'

'కాసేపటికింద అతన్ని అతి చిన్నమొత్తం అప్పిమ్మని అడిగా. నువ్వు నమ్ముతావో లేదోగాని, కావుడూ, లేదు పొమ్మన్నాడు,' భంగపడ్డ రంగయ్యనాయుడు కోపంగా చెప్పుకుంటూపోయాడు. 'ఒక్కసారి చేతులు విదిల్చేశాడు. ''లేదండయ్యా'' అన్నాడు. వాడసలు డబ్బులో మునిగి తేలుతున్నాడని నా అంచనా. అదృష్టంకొద్దీ నీలాంటి వాళ్ళు వుండబట్టి సరిపోయిందిగాని లేకపోతేనా? నీదెంతో విశాల హృదయం. నువ్వు నేస్తానివి, బంగారమంత పరిశుద్ధం. మా చిట్టి కావుడు. మా మంచి కావుడు. కావుడూ, మరేం, నాకో వెయ్యి రూపాయలు సర్దగలవా?'

'వెయ్యి రూపాయలా?'

'చాలా అవసరం నాకు.'

'ఏవిటి, జాతర చెయ్యాలా?'

'అవును,' అంటూ గట్టిగా అరుస్తూ చెప్పుకొచ్చాడు. 'నేను చేసితీరాలి. తగినంత పైకం పోగుచెయ్య గలిగితే ఈ జన్మకి సరిపడేంత జాతర చేస్తా. అయిదు సంవత్సరాలబాటు రాత్రిళ్ళు నేనసలు బయటికే అడుగు పెట్టలేదు తెలుసా? రత్నమాలనించి నేను రాబట్టగలిగిందల్లా సిగరెట్టు ప్యాకెట్టుకి సరిపడినంత డబ్బు మాత్రమే సుమా. బంగారు పంజరంలో బందీగా వున్న పురుగుని నేను. అంచేత నాకో వెయ్యి రూపాయలు సర్దాలి. సర్దుతావుగా కావుడూ?'

కామాక్షీదేవి కళ్ళలో సానుభూతి చిందులేసింది. ఢక్కామొక్కీలు తింటున్న ఆ మనిషిని చూసి ఆమె హృదయం ద్రవించింది.

'నాదగ్గిరే కనక వెయ్యి రూపాయలుంటే యివ్వకపోదునా నా దివాలాకోరు మిత్రమా! తప్పకుండా ఇచ్చేదాన్ని,' అందామె. 'నీ బుగ్గల్లో మళ్ళీ నెత్తురు ప్రవహించాలంటే నీక్కావలసిందల్లా ఒక్కరాత్రి వీరవిహారమే తగిన మందు అని నా అభిప్రాయం కూడా. అయితే పైకం విషయంలో నీకెంత యిబ్బందుందో నాకూ అంతే వుంది. నా దగ్గిరే కనక బ్యాంకులో డబ్బు మూలుగుతుంటే మా అక్క రత్నమాల స్వీయచరిత్రని ఆవిడ పేరుతో రాయటానికి యిక్కడికొచ్చేదాన్నా?' వాత్సల్యంతో అతని బుజం తడుతూ, 'పాపం నీరోజు చెడగొట్టినట్టున్నా. చాలా విచారంగా వుంది. పేదరికం ఆధ్యాత్మికతని దగ్గిరకి తెస్తుందని చెత్త వాగుడు వాగుతారందరూ,' అంటూ నీతిశాస్త్రాన్ని ప్రబోధించే దారి తీసిందామె. 'పేదరికం నన్ను మాత్రం డబ్బున్న వాళ్ళ అదృష్టాన్ని – నాతోబాటు సంబంధం–షణ్ముగం కంపెనీలో పనిచేసిన కుర్రాడికి పట్టినట్టు – చూసి అసూయ పడేట్టుగా చేసింది. ఆ కుర్రాడి గురించి చెప్పానా? వుద్యోగానికి వుద్వాసన కావటంతో విశాఖపట్నం తిరిగెళ్ళిపోయాడు. చూస్తుండగానే ఏదో వూరగాయల కంపెనీ వాళ్లు తీసిన డ్రాలో లక్షరూపాయల ప్రైజొచ్చిందట. ఆమధ్యనే ఎక్కడో చదివా. నా జాతకంలో అలాంటిదెప్పుడైనా రాసి పెట్టుందా? లేదు, వెయ్యేళ్ళయినా యింతే.'

'నాకూ అంతే. కానీ ...'

రంగయ్యనాయుడు కొంచెం తటపటాయించాడు. మెడ పక్కకి తిప్పి జాగ్రత్తగా బుజం వెనక్కి చూశాడు. రెండో బుజం వెనక్కి కూడా మళ్ళీ అలాగే చూశాడు. ఈసారి పూర్తిగా తల వెనక్కి తిప్పి జాగ్రత్తగా పరిశీలించాడు.

అతనలా మెలికెలు తిరుగుతుండటం చూసి విస్తుపోయి, 'ఊ, కానీ... ఏమిటి?' అని అడిగింది.

'నీకో విషయం చెప్తా కావుడూ,' కుట్ర పన్నుతున్నట్టు గొంతు తగ్గించి రహస్యంగా అన్నాడు రంగయ్య నాయుడు.

'సరే, చెప్పేదేదో గట్టిగా చెప్పు. ఒక్క ముక్క కూడా వినబడ్డంలేదు నాకు.'

'ఇదేదో యిల్లెక్కి చుట్టుపక్కలంతా వినిపించేట్టు చెప్పేది కాదు. మీ అక్క రత్నమాల కనక ఈ సంగతి విందనుకో, అంతే, దాంతో నాకు డబ్బు సంపాదించే అవకాశం ఫట్టుమని ఎగిరిపోతుంది.'

'నీకు డబ్బు సంపాదించే అవకాశం లేనేలేదయ్యా.'

'అక్కడే పప్పులో కాలేస్తున్నావ్. నేననుకున్నది అనుకున్నట్టు జరిగితే మంచి అవకాశాలున్నాయి. కావుడూ, ఈ యిల్లుంది చూశావ్, యిది యింతకుముందెవరిదో తెలుసా నీకు?' అని అడిగాడు.

'తెలుసు. కొండగుర్తు యిది. మళయాళం సినిమాల హీరోయిన్ కుంజురాణిది.'

'సరిగ్గా చెప్పావు. కుంజురాణి ఎస్టేట్స్ బాగోగులు చూసేవాళ్ళనించి ఈ యింట్లో వున్న సామాను, సరంజామాతో సహా వున్నదున్నట్టు మీ అక్క కొనేసింది. విమాన ప్రమాదంలో కుంజురాణి చనిపోకముందు ఎలా వున్నాయో ఆవిడగారి వస్తువులన్నీ యింకా యిక్కడ అలానే వుండిపోయాయి. బుర్రకెక్కిందా? ఆవిడకి చెందినవన్నీను.'

రంగయ్యనాయుడు మళ్ళీ యింకోసారి మెడ తిప్పి బుజం వెనక్కి రెండు వైపులా చూశాడు. గొంతు మరింత తగ్గించాడు. ఇంతకుముందు తోటలో విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు రోమను ప్రభువులా కనిపిస్తే, హత్యలు చేయించే శాఖకి ముఖ్యుడైన ఉపప్రధానితో చెయ్యబోయే హత్య గురించి మంతనాలు జరుపుతున్న రోమను ప్రభువులా కనిపిస్తున్నాడిప్పుడు.

'కుంజురాణీదేవికి డైరీ రాసి పెట్టుకునే అలవాటుండేది.'

'అలాంటి అలవాటుండేదా ఆమెకి?'

'అలా అనే అందరూ అంటూంటారు. ఇప్పుడు నేనా డైరీ గురించి యిల్లంతా వెదుకుతున్నా.'

'ఎందుకూ, ఆవిడగారి జీవితచరిత్ర రాద్దామనుకుంటున్నావా?'

'నేనా డైరీని కనుక్కోగలిగితే, ఓహ్ ఆకాశంలో తేలిపోతా. కాస్త ఆలోచించు కావుడూ. బుర్రకి కొంచెం పదును పెట్టు. ఆ మనిషి ఎలాంటి జీవితం గడిపిందో నీకు బాగా తెలుసు. సినిమారంగంలో వున్న ప్రముఖులందరితోనూ, అంటే – యాక్టర్లు, ప్రొడ్యూసర్లు, డెరెక్టర్లు వగైరాలందర్తోనూ – ఆవిడగారికి రకరకాల సంబంధాలుండేవి. తీరిక దొరికినప్పుడల్లా ఆ విశేషాల్ని తన డైరీలోకి ఎక్కిస్తూ వుండేది. అసలిదంతా ఎందుకులేగాని, ఆ డైరీ కనక దొరికిందంటే లంకెబిందెలు దొరికినంతన్నమాట.'

'నువ్వు చెప్పేదాన్ని బట్టి చూస్తే సినిమారంగంలో వున్న ప్రముఖులు కొందరు తమ గురించి ఆ చిన్న పుస్తకంలో రాసున్న విషయాలు బయటికి పొక్కకుండా వుండటానికి ఎంత డబ్బు ఖర్చు పెట్టడానికైనా వెనకాడరని అంటున్నావా?'

'కొందరు కాదు, దాదాపు గొప్ప గొప్ప వాళ్ళందరూను.'

కామాక్షీదేవి అతని వైపు సౌమ్యంగా చూసింది. అతని ఆధ్యాత్మిక ప్రవృత్తిలో వున్న లోపాలు ఆవిడగారి దృష్టిలోకి రాలేదని కాదు, అయినా ఆవిడకి రంగయ్యనాయుడంటే మొదటినించి అవ్యాజమైన అనురాగం, ప్రేమాను. రంగయ్యనాయుడికన్నా బద్ధకస్తుడు మరొకడ్ని ప్రపంచంలో ఇంతవరకూ చూడలేదావిడ. అదే విధంగా, రంగయ్యనాయుడిని మించి నీతి నియమాలకి అతీతంగా వుండే మరో వ్యక్తి ఈ ప్రపంచంలో వుండుంటే ఆ వ్యక్తిని కలిసే భాగ్యం ఆవిడకింకా కలగలేదు. రంగయ్యనాయుడు వట్టి స్వార్థపరుడు, సోమరిపోతు. వుండకూడని అవలక్షణాలన్నీ అతనికున్నాయి. అయినా ఆమె అతన్ని ప్రేమించింది. ఇరవై సంవత్సరాల కిందట యవ్వనంలో వున్న రంగయ్యనాయుడి మొహానికి ఒక్కటే గడ్డం వేళ్ళాడుతూ, సంచుల్లో డబ్బు మూలుగుతున్న రోజుల్లో అతనంటే ఆమెకి యిష్టం కలిగింది, ప్రేమించింది. వయసుమళ్ళి, ఆ గడ్డానికి కింద మరో గడ్డం జోడై చేతిలో చిల్లిగవ్వలేని యీరోజుల్లో కూడా అతని మీదున్న ప్రేమ ఆవిడకేమాత్రం తగ్గలేదు. ఎందుకో, ఆడవాళ్ళు యిలాంటి పనులే చేస్తూంటారు.

'దీన్నిబట్టి, బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు సంపాదించాలని చూస్తున్నావన్నమాట,' అని అడిగిందావిడ.

'బ్లాక్‌మెయిల్ కాదిది,' చెప్పాడు రంగయ్యనాయుడు కోపంగా. 'పూర్తి అసలు సిసలు వాణిజ్యపరంగా జరుపుకునే లావాదేవీలివి. వాళ్ళకా డైరీ కావాలి, అది నా దగ్గిరుంది అంతే.'

'కాని, నీ దగ్గిర లేదుగా యిప్పుడు.'

'అంటే నా వుద్దేశ్యం నాదగ్గిర వున్నప్పుడు అని.'

కామాక్షీదేవి కడుపారా నవ్వింది. అతని పథకం కేవలం రంగయ్యనాయుడికే చెందిన కల్తీలేని ఆలోచన అని అనిపించిందామెకి. అయినా అతని మీద ఆమెకున్న అనురాగం, ప్రేమ ఏమాత్రం సన్నగిలలేదు. ఎవరైనా ఎదురుగుండా వచ్చి ముఖమ్మీదనే, ''కామాక్షీదేవిగారూ, అనవసరంగా ఒక అపాత్రుడి మీద యింత ప్రేమ వొలక బోసి తమరి కాలాన్ని వృథా పుచ్చుతున్నారు,'' అని కనక అంటే, ''మీరన్నది యదార్థమే సుమండీ, అయినా నాకు అదే యిష్టం,'' అని తక్కున జవాబిచ్చుండేది.

'రంగడుబావా, నిజాయితీతోనైనా, మోసం చేసైనా నువ్వు ఏనాటికీ డబ్బు గడించలేవని గ్రహించుకో. కాని నేను మాత్రం – ఎలాగో తెలీదు కాని – ఏదో విధంగా సంపాదించి తీరుతా. అది జరిగిన రోజున నిన్ను తప్పకుండా పెళ్లి చేసుకుంటా.'

రంగయ్యనాయుడు భయంతో వొణికిపోయాడు.

'కావుడూ, తమాషాకి కూడా అలాంటి మాటలు అనొద్దు.'

'నేనేం తమాషాకి అనడంలేదు రంగడుబావా. ఈ విషయాన్ని యిరవై సంవత్సరాలుగా చాలా ఆలోచిస్తూ కూర్చున్నా. నిన్న యిక్కడికొచ్చి – యిన్నేళ్ళు మా అక్కతో గడపడం వల్ల మిగిలిన నీ అవశేషాల్ని చూసిన తరవాత, నేనో నిర్ణయానికొచ్చా. త్వరగా నాలుగు రాళ్ళు సంపాదించేసి వెంటనే నిన్ను పెళ్ళిపీటల మీద కూర్చోపెట్టాలి, మిగిలిన జీవితమంతా నీ బాగోగులు చూసుకుంటూ గడపాలి అని. అసలు సరైన సంరక్షణ కావలసిన వాడెవడైనా వున్నాడా అంటే అది నువ్వే. దీనికెందుకింత మథన పడుతున్నావో నాకైతే బోధపడ్డంలేదు. ఒకప్పుడు నేనంటే ఎంత పరితపించిపోయేవాడివి నువ్వు?'

'అప్పుడైతే నాకు కుర్రతనం, పైగా మూర్ఖత్వం.'

'ఇప్పుడు వయసు మళ్ళిన మూర్ఖత్వం. ఏదెలా వున్నా అప్పుడూ యిప్పుడూ నేను కోరుకున్నది, కోరుకునేదీ నిన్నొక్కడినే. అది వింతే మరి. ఏవిటీ, ఆ పాట మొదటి చరణం ఏవిటది? ''పిలిచే నా మదిలో వలపే నీది సుమా, రేరాజు ఎవరైనా నారాజు నీవే సుమా''. తప్పదు మరి ...'

'చూడు కావుడూ. దయచేసి నా మాట విను.'

'నువ్వు చెప్పేది వినడానికి టైంలేదు. నా రచనల్ని ప్రమోట చేస్తున్న ఏజెంటుతో యివాళ *రిట్జ్* హోటల్లో లంచికి వెళ్లాలి. ఒకటి రెండు రోజులకని హైదరాబాదు వచ్చాడతను. ఏదో ఒక సాకుతో ఓ వెయ్యి రూపాయలు అతని దగ్గర్నించి లాగలేకపోతానా? అలా కనక జరిగితే తీసుకొచ్చి నా రారాజే అయిన నీ పాదాల ముందు రాల్చనా.'

రంగయ్యనాయుడు తను ధరించే దుస్తుల్ని ఎప్పుడూ అతి జాగ్రత్తగా ఎన్నుకుంటాడు. బందీగా వుంటున్న ఈ కాలంలో కూడా ఎక్కడా మడత నలగని సూటు, దానికి తగిన నెక్‌టై కట్టుకుని దర్జాగా, డాబుగా వుంటాడు. కామాక్షీదేవి కట్టుకున్న చీరె వంక ఆక్షేపణగా చూశాడు.

'ఆ హోటలుకి నువ్వు యీ చీరే కట్టుకుని వెళ్లడంలేదు కదా?'

'ఈ చీరెతోనే వెడుతున్నా. నిన్ను నేను పెళ్ళి చేసుకోబోతున్న సంగతి మర్చిపోకు. ఓ మూలకి పోయి ''నాతిచరామి'' లాంటి పదాల్ని వల్లె వేసుకుంటూ కూర్చో పనికొస్తాయి. రేప్పొద్దున పురోహితుడు చెప్పమంటే తడబడకుండా వెంటనే చెప్పొచ్చు – ఎందుకంటే నీకది రాసిపెట్టుంది కనక.'

నిలువుకిటికీ తెరుచుకుని కారు దగ్గిరకి పరిగెత్తింది కామాక్షీదేవి. ఆవిడ గొంతు గట్టిగా వినిపిస్తూనే వుంది యిక్కడి దాకా.

'పిలిచే నా మదిలో వలపే నీది సుమా, రారాజు ఎవరైనా నారాజు నీవే సుమా.'

రంగయ్యనాయుడు సోఫాలో నీరసంగా వెనక్కి ఆనుకుంటూ అది యిస్తున్న గట్టి ఆసరాకి కృతజ్ఞతతో వాలిపోయాడు. వాతావరణం వేడిగానే వున్నా ఘోటక బ్రహ్మచారిగా వుందామని నిశ్చయించుకున్నవాడు పెళ్ళి విషయం తలుచుకుంటే ఎలా వొణికిపోతాడో అలా వొణుకుతూ కూలబడ్డాడు.

*

ఆరోజు మధ్యాహ్నం రవికుమార్, కుమారి లలితని విశాఖపట్నం జగదంబా విలాస్‌లో లంచికి ఆహ్వానించాడు. తన యిష్టప్రకారమైతే ఏ డాల్ఫిన్సుకో, మరో పెద్ద హోటలుకో తీసుకెళ్ళుండేవాడు. వయసులో వున్నప్పుడు డబ్బు దుబారా చెయ్యకూడదని, వూరగాయల కంపెనీ డ్రాలో ఎంత డబ్బొచ్చిపడినా జీవితంలో పొదుపనేది నేర్చుకోవాలనీ లలిత చెప్పడంతో సర్దుకుపోవాల్సి వచ్చింది. లలిత బాబాయిగారైన రంగయ్యనాయుడిలా చివరకి మనకి కూడా ఏమీ మిగలదని ఆమె అభిప్రాయం. రుచికరమైన భోజనానికి అలవాటుపడ్డ రవికుమార్ పొట్టకి అక్కడ వడ్డించిన పదార్థాలు నచ్చలేదు. అయినా ఎలాగో అలాగు కతికి అయిందనిపించాడు. ఐస్‌క్రీం ఒక్కటి మాత్రం మిగిలింది, దాన్ని కూడా ఎలాగో అధిగమించాలి.

వెయిటరు ఐస్‌క్రీం తీసుకొచ్చి రవికూమార్ వీపు మీద గట్టిగా వూపిరి వదిలి వెళ్ళిపోయాడు. అప్పటి వరకు ఆ హోటలు భోజనాన్ని విమర్శిస్తూన్న రవికుమార్, ఆ విషయాన్ని వదిలి లలితని కలిసినప్పుడల్లా అతనికి స్ఫురించే ఒకే ఒక్క విషయం వైపు దృష్టి మరల్చాడు.

'ఈ అధ్వాన్నపు భోజనం గురించి యిప్పుడెందుకులే, నీకిష్టమైతే తరవాతెప్పుడన్నా మళ్ళీ చర్చిస్తా. మాట్లాడుకునేందుకు అంతకన్నా ముఖ్యమైన విషయాలున్నాయి. ఇదిగో, ఇప్పుడే నా మొహం చూడొద్దు, నన్ను పెళ్ళి చేసుకోవటం నీకిష్టమేనా?' అని అడిగాడు.

మోచేతులు టేబులు మీద ఆనించి అరచేతుల్లో గడ్డాన్ని దాచుకుని అతని మొహాన్నే పరిశీలిస్తోంది లలిత. నిశితమైన ఆ చూపులు – ఏదో కంటికి కానరాని చెయ్యి అతని గుండెల్లోకి కవ్వం దించి చిలుకుతున్నట్టు అనిపిస్తాయతనికి. మొదటిసారి కలిసినప్పటినించి ఆమెలో కనిపించే ఈ గంభీరతే అతన్ని మహా ఆకర్షించింది. ఈ ప్రపంచంలో – అందులోనూ కొద్దిరోజుల ముందటివరకూ, అంటే ఆమెని కలవకముందు తను గడిపిన సినిమా రంగంలో – *ఆడనవ్వు* విరివిగా వున్నట్టు భావించేవాడతను. లలిత అడుగుపెట్టకముందు జీవితమంతా కళ్ళు జిగేలుమనేలా నవ్వుతూ, ఆనందంతో కేరింతలు కొట్టేవాళ్ళతో నరకంలా వుండేదని అప్పుడప్పుడు అనిపిస్తుండేది.

'నిన్ను పెళ్ళి చేసుకోవాలా?'

'అవును, కరెక్ట్.'

'నీకేమిటి అన్నీ వింత వింత ఆలోచన్లొస్తున్నాయ్?' అడిగింది లలిత.

తల వెనక్కి తిప్పి చూసింది. జగదంబా విలాస్‌లో అన్ని రకాల జనం వస్తారు. సాంఘిక మర్యాదలకి అక్కడంత చోటులేదు, ఎవరూ పట్టించుకోరు కూడా. ఓమూలగా కూర్చున్న జంట యింట్లో మాదిరే యిక్కడ కూడా పెద్దగా అరుస్తూ హాయిగా పోట్లాడుకుంటోంది. తల ముందుకు తిప్పగానే మందలిస్తున్నట్టు కనుబొమలు ముడిచిన రవికుమార్ మొహం కనిపించిందామెకి.

'వాళ్ళనసలు పట్టించుకోకు లలితా,' అంటూ ప్రాధేయపడ్డాడతను. 'మన సంసార జీవితం అలా వుండదులే. అయినా వాళ్ళిద్దరూ భార్యాభర్తలు కాకపోవచ్చు.'

'అతనైతే ఆమెని మొగుడులాగానే దబాయిస్తున్నాడు.'

'మన సంసారం మహా ప్రశాంతంగా సాగుతుందనుకో. నువ్వు శ్యామలారాణి నవలలు చదివావా? చదివుంటే, దేశంలో గొప్ప మొగుడంటే రమేశ్‌కుమార్ అని వొప్పుకోవాలి. మా యిద్దరికీ చాలా దగ్గిర పోలికలున్నాయ్ – ప్రేమించే హృదయం, మంచి స్వభావం, పెంపుడు కుక్కలంటే యిష్టం, ఉప్మా పెసరట్టంటే మరీ

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Apadbandhavi+Uraf+Papalabhairavi**

* * *